

# అద్దం తిరిగిన కథ

శ్రీ జి. వి. యల్. నరసింహారావు

"నరేంద్రబాబూ!"

నరేంద్రు డామధురస్వరం విని విస్మయంగా తలెత్తి చూశాడు. ఒక్కక్షణం పరకాయించి మేజామీది కాళ్ళు క్రిందికిదించి, చేతిలోని పేపరు అవతల పెడుతూ ఆప్యాయంగా ఆహ్వానించాడు —

"ఓహో, మీరా! రండి రండి అలాకూర్చోండి!!" ఎదురుగా ఉన్న ఛెయిరు చూపిస్తూ ఆదరించాడు.

ఆమె ఛెయిరులో కూర్చుని చేతిలో ఉన్న పత్రికను టేబిల్‌మీద విసిరికొట్టి అంది కోపంగా! "మీరు నామీద కథ ఎందుకు వ్రాశారు?"

"మీమీదా?" అతడాశ్చర్యంగా ఆమె ముఖంలోకి చూస్తూ అడిగాడు.

"అవును నామీదే — ఇదిగో....!" ఆమె పత్రికవిప్పి ఒక ఆర్టికిల్‌కేసి చూపిస్తూ అంది "ఇది వ్రాసిందెవరు?"

"అర్థంలేనిప్రశ్న!" అనుకున్నాడు అతడు మనసులో.

"నరేంద్ర!" రచయితపేరుజవాబురూపంలో జాగ్రత్తగాచదివాడు.

"బుద్ధిలేని జవాబు!" అనుకుందామె స్వగతంలో—

"అంటేనే, ఎవరని?" గద్దించింది ప్రకాశంగా!

'అహంకారం' అనుకున్నాడు తనలో "కనబడ్డాంలా? రచయిత!" అన్నాడు యుక్తిగా.

"అధికతెలివి!" అని మండిపడిం దామె.

"అంతేకావచ్చు!" తగ్గుతూ ఆమోదించాడు. విజయవంతమయిన ఈ లొంగుబాటు నామె భరించలేక పోయింది,

"సిగ్గులేక పోతేసరి!" ముక్తసరిగా తేల్చేసిందామె.

"ఎందుకూ?" అన్నాడతడు ఆయోమయ్యంగా. "ఎదురుగా ఉన్నది ఆడదయిపోయింది. లేకపోతేనా?" అనుకుంటూ మనస్సులో!

"మీరిప్పుడిప్పుడే 'లా' చదివొచ్చారని తెలుసు!" అందామె, ఏమనడానికీ తోచక ఎత్తిపొడుపు రూపంలో!

తను లాచదివినట్టు ఆమెకు తెలిసినందుకు అతడు మనసులో సంతోష పడ్డాడు. "మరి మీరేమి చదువుతున్నారో....నాకు తెలియదే!" కుర్చీలో సర్దుకు కూర్చుంటూ కాలరుమీదికి చేతులు పోనిచ్చి అన్నాడు నసుగుతూ!

"ఛీ....!"అతనిమొండితనాన్ని అసహ్యించుకుందామె.

"ఏదీ, ఎక్కడ? **ఏయ్** - ఛీ-ఛీ-ఛీ!" అధాటున ఎగిరిపడి లేచి కర్రకోసం నాలుగు ప్రక్కలా చూడసాగాడు.

ఆమె కంగారు పడింది "ఏమిటది?" కాళ్ళు వెనక్కు తీసుకుంటూ ప్రశ్నించింది.

"కుక్క" అతడు సందేహంగా అన్నాడు.

"ఏదీ రాందే!"

"ఏమో, మీరే అన్నారుగా"

"ఏమనీ?"

"ఛీ అని"

ఆమె దిగాలుపడి కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ ఉస్సురని కుర్చీకి జారగిల బడింది. అతడూ నెమ్మదిగా కూర్చున్నాడు.

"ఏమండోయ్, మీరు వచ్చారు బాగానేఉంది. వెంట ఈ "ఛీ ఛీ" లు కూడా ఎందుకు తెచ్చినట్టు? ఆమె తన్ను ఊరికేనే గడబిడ పెట్టేసిం దనుకొని అతడు చికాకుగా నిగ్గదీశాడు.

ఆమె కోపంగా కుర్చీలో సర్దుకు కూర్చుంటూ టేబిల్ మీదికి వంగి అంది "నేను మీతో పరిహాసా లాడ్డానికి రాలేదు- వ్యవహారం మాట్లాడ్డానికి వచ్చాను!"

అతడు కరకుగానే జవాబిచ్చాడు. "థాంక్స్ అదే నేనూ చెబుదామనుకుంటున్నా ! పరిహాసాలాడ్డాని కయితే నాకు ప్రస్తుతం తీరికలేదు. వ్యవహారమేదయినా ఉంటే యిప్పుడుకాదు వర్కింగ్ అవర్సు సాయంత్రం 3నుండి 5 వరకు, లేదా ఉదయం 8 నుండి 10 వరకూ ....ఇంక ఫీజు విషయ మంటారా? గుమస్తా...."

"హుం నాకు మీతో వ్యవహారం లేదు. నేను మీమీద నేరారోపణచేస్తున్నాను. సంజాయిషీకావాలి!" ఆమె బల్ల గుద్ది, క్రుద్ధురాలై డిమాండ్ చేసింది—"చెప్పండి ....సంజాయిషీ!" అతడు ఆసక్తిగా ముఖంపెట్టి ప్రశ్నించాడు. "అంతేనా, దావా...."

"ఆ అవసరమైతే దావాకూడా వేసేతీరుతాను!" ఆమె తిరిగి బల్ల గుద్ది చెప్పింది.

"ఆపండి ! నామేజాపాతది- నల్లులన్నీ మీవొళ్ళో పడితే నాది జవాబుదారి కాదు, ఆ.... దావా కదూ వేస్తామంటున్నారు? అయితే యిటు చూడండి ! అయిన పరిచయమేదో అయింది. ఆ వకాల్తానామా మట్టుకు".... ఆమె నిర్విణ్ణురాలైంది. ఇలాంటివ్యక్తితో ఏడవాలో, నవ్వాలో కూడా తెలియలేదు. క్షణం దిగాలుపడి చూస్తూకూర్చుంది.

"మనియార్డరుంది సార్ !" అంటూ పోస్టుమాన్ రావడంతో ఆగది వాతావరణం మారిపోయింది. అతనికి మనియార్డరు, ఒక కవరు యిచ్చివెళ్తూ "మీరు ఎదురింటి వారేకాదమ్మా? మీకూ ఓకవరుంది- 'మిస్ నిర్మల!' అంటూఆమెచేతిలోనూ ఒకకవరుపెట్టి చక్కాపోయాడు. ఆమె ఉత్తరం విప్పిచూసుకుంది. పెళ్ళి చూపులకెవరో వస్తారు రెండురోజుల్లో, సెలవులీయగానే బయలుదేరి రమ్మని ఆమె తండ్రి రాసిన ఉత్తరమది "కుటుంబం సాంప్రదాయకమయినది. అన్ని విధాల యోగ్యమయిన సంబంధం. కుర్రాడు 'లా' చదివాడు. ప్రస్తుతం పట్నంలోనే అప్రెంటిస్‌షిప్ చేస్తున్నాడు, పేరు "యం. నరేంద్ర నాథ చౌదరి" అన్న వాక్యాలు చదివి ఆమె సిగ్గుతో కుంచుకు పోయింది, ప్రాణాలు చచ్చినంత లజ్జ పడిందా అమ్మాయి.

'అతడు కూడా ఉత్తరం చదివి టేబిలుమీద పడవైచి టేబిల్‌మీది నోట్లు జేబులో కుక్కుకుంటూ ప్రశ్నించాడు ఉదాసీనంగా "యింతకీ మన దేవూరన్నారు?"

"ఏటవతల 'శిరిచింతల'!" ఆమె తలెత్తకుండానే చెప్పింది. అతడు ఆసక్తిగా ముఖంపెట్టి ఉత్సాహంగా అన్నాడు. "మాదీ, ఆదగ్గర్లోనే" 'పశిబచ్చల' అయితే చూడండి మీ వూళ్ళో "యం. శీతారామయ్యగారి నెరిగుండారూ? అయన కొకకూతురు ఎక్కడో కాలేజీలో బి. ఎ. చదువుతోందిట!" ఆమె శరీరం గగుర్పొడిచింది అవయవవాలు సిగ్గుతో కుచించుకు పోయాయి. ముఖాన్ని సిగ్గుదొంతరలు కప్పగా గబగబాలేచి బయట కొక్కటే పరుగు తీసింది—అతను కేకవేస్తున్నాడు "ఏమండోయ్" మీ పుణ్యం చెప్పకపోతే మానిరి మీ మాగజేన్ తీసుకపొండి !"

* * *

ఆ రాత్రి అతడామెను ఆప్యాయంగా తీసుకువెళ్ళి మంచం మీద తన సరసనే కూర్చుండ బెట్టుకున్నాడు. భుజంమీద చెయివేసి పొదివి పట్టుకుని ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు.

"ఇంతకీ ఆ కథ వ్రాసిందెవరు?"

"ఛీ...." అంటూ ఆమె ముఖం చేతుల్లో కప్పుకుని అతని వొళ్ళో వాలింది.

"ఏయ్, ఏదీ, ఎక్కడ ? ఛీ ఛీ ఛీ" అన్నా డతడు నెమ్మదిగా ఆమెని త్రోసివేస్తున్నట్టు గాభరా నటిస్తూ గదంతా పకపక నవ్వులతో నిండిపోయింది. తలుపుసందుల్లోనుండి ఉషారుకొద్ది నిక్కి చూస్తున్న ముది ముత్తయిదులందరూ యిదేమీ అర్ధంగాక తెల్లముఖాలేశి మెల్లగా జారుకున్నారు.

అతడు తిరిగి వళ్ళో వాలిన ఆమెను ఆప్యాయంగా తల నిమురుతూ క్రిందికి చెవులో ప్రేమగా అడిగాడు. "నిజంగా....ఎవరు వ్రాశారది?"

ఆమె అతని మెడకు చేతులుచుట్టి గారాబంగా ముఖంలోకి చూస్తూ నునుసిగ్గుతో "వెధవ, మా తమ్ముడే-నా అలవాట్లన్నీ వర్ణిస్తూ కథవ్రాశాడు ! వాడిపేరూ అదే మీపేరు!" అంది కిలకిల నవ్వుతూ ! అతడు క్షణం నిశ్చేష్టుడయాడు.?